# సుబ్బాయమ్మగారు

-జొన్నలగడ్డ రామలక్ష్మి

**2**

ఎవ్వరూ మాట్లాడలేదు.

అప్పుడాయన తన పడక గదిలోనికి వెళ్ళారు. అలమారాలోంచి తాడు ఒకటి తీశాడు. గది మధ్యన స్టూలు వేసుకున్నాడు. దాని మీద నిలబడి తాడును పైనుంచి వ్రేలాడుతున్న హుక్‌కు తగిలించి ఉరి తాడు తయారు చేశాడు.

తను స్టూలు మీద నిలబడి – "ఏమర్రా!" అన్నాడు. అదాయన భార్యను పిలిచే పద్ధతి.

సుబ్బాయమ్మగారా గదిలోకి వెళ్ళి అక్కడి పరిస్థితి చూసి "ఎందుకు నన్ను పిలిచారు?" అన్నది.

"నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను—" అన్నాడాయన.

భార్యచేత ఎలాగో అలా డబ్బు పుట్టించే ఏర్పాటు చేయించడానికి ఆయన వాడే ఆఖరి అస్త్రం అది. గత అయిదారు సంవత్సరాలుగా ఇలాంటి సందర్భం ఆ యింట్లో ఏడాది కొక్కసారైనా ఏర్పడుతున్నది.

"నన్నెందుకు పిలిచారు?" అన్నది సుబ్బాయమ్మగారు.

"నా పిల్లలు నాకు భయపడి నిన్ను గౌరవిస్తారనుకున్నాను. వాళ్ళకు నేనంటేనే గౌరవం లేదు. నేను లేకపోతే నీ బ్రతుకేమైపోతుందోనని నా భయం."

"ఆ భయం నాకు లేదు. నేను మీకంటే ముందే వెళ్ళిపోతాను" అన్నది సుబ్బాయమ్మగారు గంభీరంగా.

"కానీ నేనిప్పుడు ఆత్మహత్య చేసుకోబోతున్నాను."

"ఇలాంటి ప్రయత్నం మీకిది కొత్తకాదు."

రామారావుగారు కోపంగా – "అంటే నిజంగా నేను ఆత్మహత్య చేసుకోననా నీ అనుమానం?" అన్నాడు.

"ముత్తైదువగా నాకు చావు రాసిపెట్టి ఉన్నపుడు మీరు చావాలనుకున్నా చావలేరు. మంగళగౌరి, వరలక్ష్మి మీ మనసు మార్చుతారు. మీరు ఆత్మహత్య చేసుకోలేరు" అన్నది సుబ్బాయమ్మగారు.

"నా మనసు మారాలంటే నాకు వెయ్యి రూపాయలు కావాలి. నేను వేళాకోళమాడ్డం లేదు" అన్నాడు రామారావుగారు.

సుబ్బాయమ్మగారు గోపాలాన్నీ, సుభద్రనూ గదిలోకి పిల్చింది.

"మా దగ్గర డబ్బు లేదు" అన్నారు ఇద్దరూ ఏకకంఠంతో.

"అయితే నేను ఆత్మహత్య చేసుకుంటాను."

పిల్లలిద్దరూ మాట్లాడకుండా గదిలోంచి వెళ్ళిపోయారు. గది బయట నుంచి సుభద్ర మాట వినపడింది "నాకివ్వాల్సిన బాకీ సంగతటుంచి ఇంకా డబ్బడుగుతాడేమిటాయన? మా అత్తారింట్లో నాకు చచ్చేటంత అవమానంగా ఉంది."

సుబ్బాయమ్మగారు నిట్టూర్చి "బల్ల దిగండి. మీకు డబ్బు దొరకదు" అన్నది.

"నువ్వు సాక్షాత్తూ లక్ష్మివి. నీవు నా ముందున్నంతసేపూ నాలో ఆశచావదు. నువ్వు వెళ్ళిపోతే నేనే చచ్చిపోతాను" అన్నాడు రామారావుగారు

ఆయన మొండిపట్టుదలకు సుబ్బాయమ్మగారికి చిరాకేసింది. తనకు భర్తకు సాయపడాలనే ఉన్నది. కానీ ఏం చేయగలదు?

"అయితే నేను వెడుతున్నాను" అని ఆమె గది బయటకు వచ్చేసింది. కానీ తలుపుదాటి ఎంతో దూరం వెళ్ళలేదు. భర్త నిజంగా ఏ అఘాయిత్యమైనా చేస్తాడేమోనని ఆమె భయం.

"ఏమర్రా–నేను బ్రతకాలని మీకు లేదా?" రామారావుగారి గొంతు గంభీరంగా ధ్వనించింది.

ఎవరూ మాట్లాడలేదు.

"నేను నిజంగానే చచ్చిపోతున్నాను."

ఎవరూ మాట్లాడలేదు. ఇటువంటి బెదిరింపులతో అందరూ విసిగిపోయి ఉన్నారు.

"ఎవరూ మాట్లాడరు కదూ?"

రామారావుగారికి బదులు రాలేదు.

మాట్లాడరు కదూ?"

అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు.

"మాట్లా...."

గదిలోని మాట సగంలో ఆగిపోయి అటుపైన దబ్బుమన్న శబ్దం అయింది. శబ్దం వింటూనే సుబ్బాయమ్మగారు గదిలోనికి పరుగెత్తింది. ఆమె వెనువెంటనే పిల్లలూ పరుగెత్తారు.

గదిలో కొక్కెనికి ఉరిత్రాడు అలాగే వ్రేలాడుతున్నది. రామారావుగారు పరుపుల మంచం మీద బోర్లాపడి ఉన్నాడు.

గోపాలం–"నాన్నా!" అంటూ ఆయన్ను వెల్లకితలా తిప్పాడు.

రామారావుగారిలో చలనం లేదు.

ఒకరు గదిలోని త్రాడు విప్పి మూలపెట్టారు. ఇంకొకరు డాక్టరు కోసం పరుగెత్తారు.

డాక్టరు వచ్చి ఆయన హఠాత్తుగా గుండె ఆగి మరణించినట్లు చెప్పారు. ఒక్కసారి ఇల్లంతా శోకసముద్రంలో మునిగిపోయింది.

రామారావుగారి అంత్య క్రియలు ఘనంగా జరిగాయి.

*


అంతపెద్ద మండువాయింట్లో ఇప్పుడు సుబ్బాయమ్మగా రొక్కరూ ఉంటున్నారు. అందులో కొంత వాటాను నూరు రూపాయలకు అద్దెకిచ్చినప్పటికీ ఆ యింట్లో ఆమెతోపాటు అయినవాళ్ళు ఒక్కరు కూడా లేరు. అందుకెవర్ని తప్పుపట్టాలో తెలియదు.

భర్త మరణానికి పిల్లలే కారణమని సుబ్బాయమ్మగారు అభిప్రాయపడింది. ఆమెకు వాళ్ళంటే మనసులో చాలా కోపంగా ఉన్నది. భర్తనే దైవంగా పూజించి, భర్తనే ప్రాణంగా భావించి భర్తకు తన సర్వస్వాన్నీ అంకితం చేసిన ఆమె చివరి క్షణాల్లో భర్త గురైన హృదయవేదనను

భరించలేకపోయింది. ఆ హృదయ వేదనకు కారకులైన పిల్లలనూ ఆమె క్షమించలేకపోయింది.

తల్లిని పెద్దకొడుకు తనవద్దకు వచ్చి ఉండమన్నాడు.

"నేనీ ఊళ్ళోనే ఈ యింట్లోనే ఉంటాను" అన్నది సుబ్బాయమ్మగారు.



"ఈ ఇల్లు అమ్మేయాలి కదా!" అన్నారు పిల్లలు.

"అమ్మడం ఎందుకు?"

"అప్పులు తీర్చడానికి!

"ఆ మాత్రం అప్పులు మీరు తీర్చగలరు" అన్నదామె.

"అమ్మా – కనీసం ఆడపిల్లల సొమ్మైనా వెనక్కిప్పించేయాలి. అది మన కుటుంబానికి క్షేమం కాదు" అన్నాడు గోపాలం.

"నా కుటుంబం ఎలాగూ నాశనమైంది. నా క్షేమం గురించి నాకు బెంగ లేదు. మీ కుటుంబ క్షేమాల గురించి మీకు బెంగగా వుంటే ఆడపిల్లల డబ్బు మీరిచ్చుకోండి" అన్నది సుబ్బాయమ్మగారు.

"నీవు ఒక్కతెవూ ఈ ఇంట్లో ఎలాగుంటావు? నీకు ఎవరిదగ్గర ఇష్టమైతే వాళ్ళ దగ్గరకు వచ్చి వుండు" అన్నాడు ఆమె రెండో కొడుకు.

"నాకు ఇక్కడుండడమే ఇష్టం" అన్నదామె.

"పోనీ ఎక్కడో అక్కడ నువ్వు సంతోషంగా వుంటే చాలు" అన్నారు పిల్లలు ఆఖరికి.

"నాకు సంతోషం లేదు."

"ఎందుకని?"

"స్కూలుకు వెయ్యి రూపాయలివ్వడం ఆయన చివరి కోరిక. అది తీరనిదే నామనసుకు సంతోషంగా వుండదు" అన్నదామె.

పిల్లలు ముఖా ముఖాలు చూసుకున్నారు.

తండ్రి చివరికోరిక తీర్చడం తమ బాధ్యత కాదని ఆడపిల్లలు భావించారు. తండ్రి పోయాక కూడా ఇటువంటి ఖర్చులు మానకపోతే ఎలా అని మగపిల్లలనుకున్నారు.

వెయ్యి రూపాయలూ ఇవ్వడానికి ఎవ్వరూ సుముఖంగా లేరు. అందుకు వారిని తప్పు పట్టడం కష్టం. రామారావు గారి కారణంగా వారందరూ అంతవరకూ ఎంతో ఆర్థిక నష్టానికి గురై వున్నారు.

"సుబ్బాయమ్మగారిని సంతోషంగా వుంచాలనుకోవడం తెలివి తక్కువ" అని కోడళ్ళన్నారు.

"తండ్రి పోగానే ఇటువంటి ఆచారాలకు స్వస్తి చెప్పినట్లు వూళ్ళో తెలియడం మంచిది. తినికూర్చుని ఇప్పుడు వెయ్యి రూపాయలిస్తే రేపింకెవరో వచ్చి ఇంకేమో అడుగుతారు. సుబ్బాయమ్మగారు ఆ డబ్బు ఇవ్వాలని గొడవ మొదలెడుతుంది. దీనికి అంతముండదు" అని కొడుకులన్నారు.

"తండ్రి పోయినా ఆయన మనశ్శాంతి గురించే ఆలోచిస్తుంది కానీ బ్రతికున్న పిల్లల సంగతి ఆలోచించదు. ఏం మనిషి?" అని అందరూ అనుకున్నారు.

"అసలు రామారావుగారి దుబారాఖర్చులన్నింటినీ ప్రోత్సహించినది సుబ్బాయమ్మగారే. భగవంతుడి దయవల్ల కుటుంబమింకా ఇలా నిలబడి వున్నది. సుబ్బాయమ్మ గారు మాత్రం రామారావు గారు సగంలో విడిచి పెట్టిన కుటుంబ వినాశన కార్యక్రమాన్ని పూర్తి చేయాలనే సంకల్పించుకున్నది. ఆమెకు బుద్ధి రావాలంటే కొంతకాలం అయినా వాళ్ళందరూ ఆమెను వదిలిపెట్టాలి. ఆమె ముఖం కూడా చూడకూడదు" అని కూడా పిల్లలనుకున్నారు.

అందుకు కారణమున్నది.

కాలక్రమేణా అందరికీ రామారావు గారంటే నరనరాలా ద్వేషం పేరుకున్నది. ఎదుటపడి ఆయన నేమీ అనలేక లోకువగా దొరికిన తల్లి ముందు ఆయన్ను తిట్టి తమ కసిని తీర్చుకునేవారు. పిల్లలు భర్తను మాటలనడం ఆమె సహించలేకపోయేది. ఆయన్ను వెనకేసుకు వచ్చి వాళ్ళను తిట్టడమే కాక రామారావు గారి కార్యాలన్నీ వాళ్ళ ద్వారానే తీర్చేది. అందువల్ల వాళ్ళందరికీ ఆమె అంటే కూడా ద్వేషం ఏర్పడసాగింది.

ఇప్పుడు సుబ్బాయమ్మగారు ఏ పిల్లల వద్దకూ వెళ్ళకుండా తాను ఒంటరిగా వుంటానంటున్నది. అలా జరిగితే పిల్లలకు తల్లిని చూడడం లేదన్న చెడ్డపేరు వస్తుంది. తమకు చెడ్డపేరు రావడం కోసమే ఆమె అలా చేస్తున్నదని వాళ్ళందరూ అభిప్రాయపడి మరింత కోపాన్ని పెంచుకున్నారు.

"ఏడుగురు పిల్లలున్నారు. ఒక్కరంటే ఒక్కరు కూడా ఆయన చివరికోరిక తీర్చలేక పోయారు" అన్నది సుబ్బాయమ్మగారి బాధ.

'ఆయన చివరికోరిక ఎలాగో నేనే తీర్చాలి.' అన్నదామె పట్టుదల.

"ప్రాణాలు పోయేవరకూ ఆయన మసలిన ఇల్లిది. ఎవరున్నా లేకపోయినా ఈ ఇంట్లోనే నా ప్రాణాలు విడవాలి" అన్నదామె కోరిక.

వీటిని అర్థం చేసుకునే వారెవ్వరూ దొరక లేదామెకు.

భర్త చనిపోయే సమయానికి ఇల్లు తాకట్టులో వున్నది. మూడు వేలిచ్చి విడిపించుకోవాలి. ఇంటి అద్దె వందరూపాయలు మాత్రం. ఇంట్లో నలుగురు పేద విద్యార్థులుండి చదువుకుంటున్నారు. వారిని బయటకు పంపేస్తే రామారావుగారి ఆత్మకు శాంతి వుండదని ఆమె అనుమానం.

సుబ్బాయమ్మగారికి పుట్టింటి వారిచ్చిన నాలుగె కరాల పొలం వున్నది. ఫలం అనుభవించ దానికే గానీ అమ్ముకునే హక్కు లేనందువల్ల అది ఇంకా నిలబడింది. ఏటా నలభై బస్తాలకు తక్కువ కాకుండా ధాన్యం వస్తుందామెకు.

పిల్లలు డబ్బు విషయంలో ఏవిధమైన సాయమూ ఆమెకు చేయదల్చుకో లేదు.

సుబ్బాయమ్మ గారు కార్యరంగంలోనికి దుమి కింది. విశాలమైన పెరడు వున్నది. పెరట్లో కూర గాయల మొక్కలు, పాదులు వేయించింది. అక్కడ కూడా ఆమె రామారావుగారి ఆశయం దెబ్బ తినకుండా చూసుకున్నది. రామారావుగారికి పూలమొక్కలంటే ఇష్టం. దొడ్లో గులాబీలు, ఛెంకీస్, మల్లె, సన్నజాజి, రాధామాధవం వగైరా లున్నవి. అవేమీ కదపకుండా ఆమె మిగిలిన స్థలంలోనే కూరల మొక్కలు వేసింది.

ఆమెకు ఇంట్లో వుండి చదువుకునే కుర్రాళ్ళు సాయపడేవారు. వారికామె ప్రత్యేకంగా చెప్పు కున్నది.

"నేను వ్యాపార దృష్టిలో ఈ మొక్కలు వేయలేదు. పేదవారికి సాయపడుతూ ఇతరుల మేలుగురించే ఆలోచించిన నా భర్త ఆశయం నెరవేర్చడం కోసం ఇది తలపెట్టాను. మా ఇంట్లో వుండి చదువు కుంటున్నందుకు మీచేత ఇలాగ పని చేయించుకుంటున్నానని అభిప్రాయ పడితే మాత్రం మీరు నాకు పనిలో సాయపడవద్దు."

ఆమె మాటలు వినగానే నలుగురిలో ఒకడు పనికి రావడం మానేశాడు. సుబ్బాయమ్మగారు వాడిని పల్లెత్తుమాట కూడా అనలేదు.

సుబ్బాయమ్మగారిని పిల్లలెవరూ చూడడం లేదన్న వార్త ఆమె పుట్టింట్లో తెలిసింది. ఆమె తమ్ముడొకడు చూడ్డానికి వచ్చి "ఒక్కతెవూ వుంటున్నావు. మాతో వచ్చి వుండ కూడదు?" అన్నాడు.

"నన్ను మీరెవ్వరూ భరించలేరు. నేనాయన ఆశయాల కోసం పాటుపడు తున్నాను" అంటూ సంగతి వివరించిందామె.

"నా భూమి నీ ఊళ్ళోనే గదా వుంది. ఈ ఏడాది నుంచి స్వంత వ్యవసాయం చేద్దామను కుంటున్నాను. పెట్టుబడికి కాస్త సాయం చెయ్యి" అన్నదామె.

"సాయమెందుకూ? నేనే నీ పొలం తీసు కుంటాను." అన్నాడు తమ్ముడు.

"నువ్వు వద్దు. బావకిష్టముండదు." అన్నది సుబ్బాయమ్మగారు.

పదేళ్ళ క్రితం రామారావుగారు బావమరది దగ్గర రెండు వేలు అప్పు తీసుకున్నాడు. అప్పు తీసుకున్నాడు కానీ తీర్చడం గురించి ఆలోచించ లేదు. ఓ ఏడాది ఆగి బావమరది నొక్కించడం ప్రారంభించాడు. బావమరది బాగా ఆస్తిపరుడని తెలిసిన రామారావుగారు పట్టించుకో లేదు. చివరకు అది పెద్ద గొడవగా తయారయింది. బావమరది రామారావు గారిని స్వయంగా అడిగే వాడుకాదు. సుబ్బాయమ్మగారు ఇద్దరికీ సర్ది చెప్పలేక ఇబ్బంది పడేది.

"నీ తమ్ముడు మరీ అంత అడుక్కుతింటు న్నాడా? అలా అని ఒప్పుకుంటే ఆ డబ్బు ఇప్పుడే ముఖాన కొడతాను" అని రామారావుగారూ,

"నేను లేనివాణ్ణి, ఇచ్చుకోలేను, దేహీ అని యాచించాను, పుచ్చుకున్నాను – అని బావను అనమను. మళ్ళీ నేను డబ్బడిగితే ఒట్టు." అని తమ్ముడూ,

సుబ్బాయమ్మగారిముందు సవాళ్ళు చేశారు.

చివరకు సుబ్బాయమ్మగారి కోపం తమ్ముడి మీదకే తిరిగింది.

రామారావుగారు బావమరది బాకీ తీర్చేశారు.

ఆయనకు మనసులో ఎవరిమీదా కోపముండదు. అనుకున్న పని చేయడమే ఆయన అలవాటు. ఫలితం గురించికానీ. తన చుట్టూ ఉన్నవాళ్ళ గురించి కానీ ఆయన ఆలోచించడు.

కానీ ఆయనకు తమ్ముడిమీద కోపం ఉండి ఉంటుందని సుబ్బాయమ్మగారి అనుమానం. అదే ఇప్పుడు చెప్పిందామె.

"ఇప్పుడు బావలేడుగా!" అన్నాడు తమ్ముడు.

"ఆయన నా మనసులో ఎప్పుడూ ఉంటారు. ఆయన మనసు నొప్పించే పని నేనేదీ చేయలేను." అన్నది సుబ్బాయమ్మగారు.

"అక్కా – ఇలాగైతే ఈ వయసులో నువ్వు చాలా ఇబ్బంది పడతావు" అన్నాడు తమ్ముడు.

"ఎందుకని?"

"చనిపోయినవాడిని మనసులో ఉంచుకుని బ్రతికున్న వాళ్ళను నిర్లక్ష్యం చేయడమేకాక వాళ్ళ మనసుల్ని కూడా కష్టపెడుతున్నావు."

"మీరంతా మీ మనసుల గురించి ఆలోచించు కుంటూ నన్ను నా మనసు గురించి ఆలోచించ వద్దంటున్నారు" అన్నది సుబ్బాయమ్మగారు.

"అక్కా - నేను నిజంగా నీకు సాయపడాలని వచ్చాను. ఏదైనా ఉపాయం చెప్పు" అన్నాడు తమ్ముడు.

"నువ్వు రాలేదు. ఆయన నీలో ఆ సంకల్పం కలిగించి నా దగ్గరకు పంపారు. అందుకే అడుగు తున్నాను. ఈ సంవత్సరానికి నాకు పెట్టుబడి సాయం చేయి" అన్నది సుబ్బాయమ్మగారు.

"పోనీ బావే నన్ను పంపాడని ఒప్పుకుంటాను. నీ భూమ్మీద ఎంత ఫలసాయం ఆశిస్తున్నావో చెప్పు. అంతా నేనిచ్చుకుంటాను" అన్నాడు తమ్ముడు.

"ఈ ప్రపంచమంతా డబ్బుమయం. అందువల్ల డబ్బుకోసం తమ్ముడు అక్కని మోసంచేస్తే ఆశ్చర్యంలేదు. నేను నీ గురించి అలా అనుకో కూడదు. అందుకే ఈ బాధ్యత నీకివ్వను. నువ్వు నాకు నాలుగెకరాలమీదా వంద. బస్తాలిస్తానన్నా వనుకో. దురదృష్టం కొద్దీ వానలెక్కువకురిసి పంటలు పాడయ్యాయనుకో. అప్పుడు నీ దగ్గర్నుంచి వంద బస్తాలుచ్చుకోవడం అన్యాయం.

## క్లీనింగ్ పౌడర్

ఇంట్లో ఇల్లాలికి నిత్యావసరమయ్యే వస్తువులలో క్లీనింగ్ పౌడర్ కూడ ఒకటి. పాత్రలు కడగటానికి, వాష్‌బేసిన్లు వగైరా శుభ్రం చేయడానికి, సిమెంటు నేలపైకానీ మొజాయిక్ నేలపైగాని శుభ్రం చేయటానికి ఈ క్లీనింగ్ పౌడర్ చాలా ఉపయోగకరంగా వుంటుంది. ఇది సులభంగా చౌకగా ఇంటిపట్టునే వుండి స్త్రీలు తయారుచేసుకోవడానికి వీలుగా వుంటుంది. దీనికి కావలసిన వస్తువులన్నీ కెమికల్సు అమ్మే అంగళ్ళలో అమ్ముతారు. దీనిని తయారుచేయడానికి వెడల్పైన గాజు పాత్రలోగానీ ప్లాస్టిక్ బకెట్‌లాంటి వాటిని గానీ ఉపయోగించవచ్చును. ఇది తమ ఇంటి అవసరానికే కాకుండా ఎక్కువ కొలతలతో తయారుచేసి మార్కెట్‌లో అమ్మి లాభం పొందవచ్చును. దీనిని తయారుచేయడానికి కావలసిన వస్తువులు :

## ఇవి మీరూ చేయగలరు!

వైటెనింగ్ పౌడర్ 2 కిలోగ్రాములు; వాషింగ్ సోడా ½ కిలో గ్రాం; ట్రైసోడియం ఫాస్ఫేటు ¼ కిలో గ్రాం; టీపాల్ ద్రవము ¼ లీటరు; డిటర్జెంట్ పర్‌ఫ్యూం కాంపౌండు 5 సిసిలు.

ముందుగా ఒక పాత్రలోకి వైటెనింగ్ పౌడర్ వాషింగ్‌సోడా, ట్రైసోడియం ఫాస్ఫేటు ఈ మూడింటినీ వేసి బాగా కలపాలి. చేత్తోనే మూడూ కలిసేటట్లు బాగా కలియపెట్టాలి. ఇది బాగా కలిపాక టీపాల్ ద్రవమును తీసుకుని పై మిశ్రమానికి కొద్దికొద్దిగా పోస్తూ వుండలు కట్టకుండా నలుపుతూ బాగా కలపాలి. ఈ విధంగా మొత్తం టీపాల్ ద్రవమును పోసి కలియపెట్టాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఒక పేపరుమీద పల్చగా పోసి ఎండలో పెట్టి ఒక గంటసేపు ఎండనివ్వాలి, అప్పుడు తడి ఆరిపోయి, పొడిపొడిగా అవుతుంది. కాకుంటే మరో అరగంటసేపు ఎండలో వుంచి తీయాలి. అంతేకానీ ఎక్కువసేపు ఎండలో పెట్ట కూడదు. ఇప్పుడు ఎండబెట్టిన ఈ మిశ్రమాన్ని రవ్వ జల్లెడలో పోసి జల్లించాలి. జల్లెడలో మిగిలి పోయిన వుండలను పారవేయకూడదు. వాటిని మళ్ళీ మెత్తగా పొడి చేసి జల్లించాలి. ఏ కొంచెం కూడా పారవేయకుండా మొత్తం జల్లించి తీసుకోవాలి. ఇప్పుడు జల్లించిన ఈ పొడికి డిటర్జెంట్ పర్‌ఫ్యూం కాంపౌండ్ వేసి మరోసారి బాగా కలపాలి. దీనివలన క్లీనింగ్ పౌడర్‌కు ఒక విధమైన సువాసన కలుగుతుంది. దీనితో క్లీనింగ్ పౌడరు తయారుచేయడం పూర్తి అయింది. దీనిని పోలితిన్ కవర్లలోగానీ ప్లాస్టిక్ డబ్బాలలోగానీ పోసి వుంచుకోవాలి.

—గార్ల సరస్వతి

---

ఎంత తక్కువ పుచ్చుకోవాలో నాకు తెలియదు. అయినవాళ్ళతో లావాదేవీలు పనికిరావు. నా మూలంగా నష్టపోయానని నువ్వనుకోకూడదు. నువ్వు మోసం చేశావని నేననుకోకూడదు.''

అక్క మాటలకు తమ్ముడు బాధపడ్డాడు. కానీ ఆమె చెప్పినట్లే చేశాడు. నిజంగా ఆమె చెప్పినట్లే జరిగింది. ఆ సంవత్సరం వాన లెక్కువగా కురిసి పంటలు బాగా పాడైపోయాయి. సుబ్బాయమ్మ గారికి పెట్టుబడిపోనూ పాతిక బస్తాల ధాన్యం మాత్రం మిగిలాయి,

ఆ సంవత్సరం స్కూల్ ఫైనల్ పరీక్ష ఫలితాలు వచ్చేలోగా తను స్కూలుకు వెయ్యి రూపాయలివ్వాలని ఆమె సంకల్పం. అందుకు అయినవాళ్ళెవరివద్దా అప్పు తీసుకోకూడదని కూడా సుబ్బాయమ్మగారు గట్టిగా నిర్ణయించుకుంది.

అయితే డబ్బు ఎలా వస్తుంది? ఎక్కణ్ణించి వస్తుంది?

ప్రతి నెలా వచ్చే ఇంటద్దెలోంచీ కొంత డబ్బు దాచి ఆమె సుమారు నాలుగు వందలవరకూ పోగు చేసింది. కూరగాయల మీద వచ్చే డబ్బూ, ధాన్యం వగైరాలతో తనకూ ఇంట్లోని నలుగురు కుర్రాళ్ళకూ రోజులు గడిచేవి.

ఏప్రిల్ నెలలో కాబోలు గోపాలం పెద్ద కొడుకు రామం సుబ్బాయమ్మగారి వద్దకు వచ్చాడు. అతడు బీయస్సీ పరీక్షలు రాశాడు. బామ్మను చూడాలని పించి వచ్చాడు.

''బామ్మా-నేను ఫస్టుక్లాసులో ప్యాసౌతాను. మంచి ఉద్యోగం వస్తుంది. నిన్ను నాతో తీసుకుని పోతాను'' అన్నాడు రామం.

''నేను ఎవరితోటీరాను'' అన్నది సుబ్బాయమ్మ గారు.

''ఎందుకని?''

''నాకో బాధ్యత ఉన్నది. అది పూర్తయ్యేదాకా ఇల్లు కదలను అన్నది'' సుబ్బాయమ్మగారు.

''ఏమిటది?''

ఆమె చెప్పింది.

''అంత డబ్బు నువ్వు ఎప్పటికి పోగు చేస్తావు? ఇంటి మీద అప్పు అదీ ఎలా తీరుస్తావు?'' అన్నాడు రామం.

''సంకల్ప బలముండాలి కానీ మనిషి సాధించ లేనిది ఉండదు'' అన్నది సుబ్బాయమ్మగారు నమ్మకంగా.

''బామ్మా-నువ్వు నాతో వచ్చేస్తానంటే నేను నీకు డబ్బు ఇస్తాను'' అన్నాడు రామం.

''నీకు డబ్బెక్కడిది?'' అన్నది సుబ్బాయమ్మ గారు ఆశ్చర్యంగా.

''బీయస్సీ పరీక్ష ఫలితాలు రాగానే నలుగురు స్నేహితులం కలిసి కాశ్మీర్ వెళ్ళాలనుకున్నాం. అందుకని మూడేళ్ళనుంచీ డబ్బులు పోగు చేసుకుంటున్నాం. నా దగ్గర అయిదువందలు పోగడ్డాయి. నాన్న రెండువంద లిస్తానన్నాడు. ఆ డబ్బు చాలు నాకు—నీకు సాయపడ్డానికి!''

''మరి కాశ్మీరు?''

''మా బామ్మకంటే నాకు కాశ్మీరెక్కువ కాదు....''

సుబ్బాయమ్మగారి కళ్ళు చెమ్మగిల్లాయి.

చిన్నప్పట్నించీ రామానికి ఆమె దగ్గిర చేరిక ఎక్కువ. తన భర్త పేరు పెట్టారని ఆమెకు అతడంటే ప్రత్యేకమైన మక్కువ ఉండేది.

''వద్దురా-నువ్వు నీ ప్రయాణం మానుకోవద్దు.''

''బామ్మా! కాశ్మీరేమైపోతుంది? ఎప్పుడు కావాలంటే అప్పుడే వెళ్ళవచ్చు. కానీ ఈ ఏప్రిల్ ఎన్నాళ్ళో ఉండదు. నువ్వనుకున్న పని అనుకున్న టైముకి సాధించాలి!'' అన్నాడు రామం.

''అంతా తాతగారి పోలిక'' అని మనుమడి వంక ముచ్చటగా చూసింది సుబ్బాయమ్మగారు.

[సశేషం]